
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



వనపర్తి

జిల్లా వార్తలు

మంగళవారం 26 ఆగస్టు 2025

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 23.0

చిన్నా, పెద్ద తేడాలేని వ్యవస్థ కావాలి

- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య
- రాజకీయాల్లో ఉంటూ ప్రజాసేవ చేసిన వ్యక్తి గుమ్మడి
- ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి

7

పెద్దపులి స్వేచ్ఛా విహారం

- నల్లమలలోని నవాబ్ బంగ్లా వద్ద దర్శనం



6

నల్లమలలో షికారీ ఘర్ వద్ద రోడ్డు దాటుతున్న పెద్దపులి

కుక్కలంటే.. మాకు ప్రాణం

- కన్న బిడ్డల్లాగా పెంచుకుంటాం
- పుట్టిన రోజులు, సీమంతాలు చేస్తాం
- ఖరీదైన ఆహారం పెడతాం, వసతులు కల్పిస్తామంటున్న యజమానులు
- నేడు జాతీయ కుక్కల దినోత్సవం

7

పెంచుకున్న వారికి నమ్మిన బంట్లు అవి... సొంత మనుషుల్లాగా ఇంట్లో కలిసిపోతాయి.. అలసిన మనసుకు సేద తీరుస్తాయి... ఒత్తిడిని దూరం చేస్తాయి.. విశ్వాసానికి మారు పేరుగా తోడుంటాయి... పెంపుడు జంతువుల్లో ప్రధానమైనవి కుక్కలు.. వీటికే జంతు ప్రేమికుల మొదటి ప్రాధాన్యం.. జాతీయ కుక్కల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

- ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్

మా కుటుంబంలో ఒకరు మ్యాగీ



గత ఐదేళ్లుగా మా కుటుంబంలో ఒకరిలాగా, ఇంటిల్లిపాది ప్రేమానురాగాలను చూరగొన్నది మా మ్యాగీ (షిట్జు జాతి) అని అచ్చంపేట పట్టణంలోని మారుతీ నగర్‌కు చెందిన కవిత తెలిపారు. ఐదేళ్ల క్రితం ఓ స్నేహితురాలు దీన్ని తమకు బహుమతిగా ఇచ్చిందని చెప్పారు. దాన్ని అల్లారు ముద్దుగా చూసుకుంటున్నామని తెలిపారు. దీనికి ఎప్పుడైనా సుస్తీ అయితే ఇంటిల్లిపాది తల్లడిల్లుతామని చెప్పారు. మేము ఎక్కడికి వెళ్లే అక్కడికి వెంట తీసుకెళ్తామని తెలిపారు.

- కవిత, అచ్చంపేట

బాధను దూరం చేసే బన్నీ



ఏదైనా బాధ కలిగితే మా 'బన్నీ'ని దగ్గరకు తీసుకుంటే మనశ్శాంతి కలుగుతుందని నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలంలోని దేవుని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన పిల్లి శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్ శాఖలో ఉద్యోగి అయిన ఆయన బెంగుళూరు నుంచి గోల్డెన్ రిట్రీవర్ జాతికి చెందిన కుక్కను రూ.25 వేలు వెచ్చించి తెచుకున్నాడు. ప్రతీ రోజు ఉదయం దాన్ని వాకింగ్ ఈసుకెళ్తాడు. షాంపుతో స్నానం చేయిస్తారు. పెరుగు అన్నం, గుడ్లు, రాయిల్ కెనిగ్ ఆహారం ఇస్తాడు. అందుకు ప్రతీ రోజు రూ.3 వందలు ఖర్చు అవుతుందని తెలిపాడు.

- పిల్లిశ్రీనివాసులు, దేవునితిర్మలాపూర్



మహబూబ్‌నగర్‌లోని షాషాబ్‌గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల

పర్యవేక్షణ కరువు

- తనిఖీలకు నోచుకోని పాఠశాలలు..?
- అమలు కాని విద్యాశాఖ నిబంధనలు
- డీఈవో, ఎంఈవోలు పర్యవేక్షణ అంతంతే
- కదలని కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నా జిల్లా అధికారులు కొందరు తనిఖీలు చేయటం లేదని తెలుస్తోంది. పాఠశాలల్లో విద్యార్థులకు అందించే బోధన, బోధనాభ్యసన కృత్యాలు ఉపయోగించి ప్రభుత్వం సూచించిన విధంగా ఉపాధ్యాయుల బోధన చేస్తున్నారా..? విద్యార్థులు ఎలా చదువుతున్నారు? అన్న అంశాలను పరిశీలించాలి. రాష్ట్రస్థాయి అధికారులు, డీఈ వోలు, అకాడమిక్ మానిటరింగ్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు ప్రతీవారం పాఠశాలను పర్యవే క్షించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. కానీ ఇవేవి క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. కాంప్లెక్స్ పాఠశాల హెడ్మా స్టర్ల నుంచి రాష్ట్ర స్థాయి అధికారులు కూడా ప్రతీవారం పాఠ శాలను తనిఖీ చేసి తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో వివరాలను నమోదు చేయాలని విద్యా సంవత్సరం ప్రా రంభం నుంచి దీన్ని అమలు చేయాలని విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. కానీ చాలావరకు మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు పాఠశాల పర్యవేక్షణ చేయడంలేదని తెలుస్తున్నది. కాగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు వేలకు పైగా పాఠశాలలు ఉన్నాయి. అందులో 78 మండలాల్లో 215 కాంప్లెక్స్ పాఠశాలలు ఉన్నాయి.

నిబంధనలిలా...

ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ తదితర పాఠశాలలను రాష్ట్ర అధికారులు ప్రతీ నెల 8 పాఠశాలలు, ఆర్జేడీ పరిధిలోని 12 పాఠశాలలను,

(మిగతా 6లో..)

తిరుపతి వెంకన్నకు గద్వాల పంచెలు

- 400 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ
- ఈ ఏడాది రాజు వంశస్థుల చేతుల మీదుగా ఏరువాడ జోడు పంచెలు అందజేత
- 27న తిరుపతికి, 28న తిరుమల ఈవోకు..



తయారు అవుతున్న తిరుమల వేంకటేశ్వరునికి ఏరువాడ జోడు పంచెలు

గద్వాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి వెంకన్నకు గద్వాల ఏరువాడ జోడు పంచెల అందజేత కార్యక్రమానికి రంగం సిద్ధమైంది. 400 ఏళ్ల నుంచి గద్వాల సంస్థానాధీశుల వారిచే అందజేసే ఈ ఏరువాడ జోడు పంచెలను 41 రోజుల పాటు చేనేత కార్మికులు ఎంతో నియమ నిష్ఠలతో తయారు చేసి సిద్ధంగా ఉంచారు. ఈనెల 27న తిరుపతికి చేరుకొని 28వ తేదీన టీటీడీ అధికారులకు గద్వాల రాజవంశీయులైన రాజా కృష్ణరాంభూపాల్ అందజేయనున్నారు. సెప్టెంబరు 23న స్వామివారికి ఏరువాడ జోడు పంచెల అంకురార్పణం కార్యక్రమం ఉంటుంది. 24వ తేదీన అఖిలాండ బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి. అక్టోబరు 2న జరిగే బ్రహ్మోత్సవాల మొదటి రోజు స్వామి వారికి ఈ జోడు పంచెలు ధరింప చేస్తారు.

గద్వాల రాజుల వంశపారంపర్యంగా...

నాలుగు శతాబ్దాలకు పైగా గద్వాల సంస్థానాధీశులు తమ వంశ పెద్దల సంప్రదాయ ఆచారంగా వేంకటేశ్వరుడికి ప్రతీ ఏటా బ్రహ్మోత్సవాల సందర్భంగా గద్వాల ఏరువాడ జోడు పంచెలను అందజేస్తున్నారు. తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉత్సవాల మొదటి రోజు విజయదశమి రోజున ఈ పంచెలను మూల విరాట్‌కు ధరింపచేస్తారు. ఈ ఏడాది ప్రత్యేకంగా రాజవంశస్థులలో ఒకరైన కృష్ణరాంభూపాల్ స్వయంగా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులకు అందజేయనున్నారు.

నామాల మగ్గంపై తయారు



జోడు పంచెలు తయారు చేస్తున్న నేతన్నలు

జోడు పంచెల తయారీకి ప్రత్యేకంగా నామాల మగ్గాన్ని తయారు చేయించారు. నేత మగ్గంపై ఇద్దరు కంటే ఎక్కువ మంది కూర్చొని పనిచేయలేరు. నామాల మగ్గంపై ఒకేసారి ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది కూర్చొని తయారు చేసే విధంగా రూపొందించారు. ఇది అత్యంత నిపుణులైన చేనేత కార్మికులు మాత్రమే తయారు చేయగలరు. వీరు పంచెలను తయారు చేసేటప్పుడు ఎంతో నియమ నిష్ఠలతో ఉండాల్సి ఉంటుంది. ప్రారంభం మొదలుకొని తిరుమలలో అధికారులకు అందజేసే వరకు పరిశుభ్రత అవసరం. పంచెలు తయారు చేసే ఇంట్లో నిత్యం పూజలు, గోవింద నామస్మరణం చేసుకుంటూ పని చేస్తారు.

పంచెలపై కోట కొమ్ములు :

ఏరువాడ పంచెలు 11 గజాల పొడవు, రెండున్నర గజాల వెడల్పు, 82 ఇంచుల వెడల్పుతో పాటు అంచులతో తయారు చేశారు. ఈ పంచెలపై సంస్థానాధీశుల రాజావారి కోట కొమ్ములు ఉంటాయి. ఒక్కొక్క పంచె తాయరు చేయడానికి దాదాపు 20రోజుల సమయం పడుతుంది. జోగుళాంబ గద్వాల జిల్లా నల్లకుంటలోని ఓ ఇంట్లో ప్రత్యేకంగా తయారు చేయించిన మగ్గంపై భక్తిశ్రద్ధలతో తయారు చేశారు. పంచెల తయారీలో చేనేత కార్మికులు సాక సత్యన్న, దామర్ల శణ్ముఖ రావు, రమేష్ మురళీలు గోవిందనామస్మరణం చేస్తూ తయారీలో పాల్గొన్నారు.

తిరుపతి వెంకన్న స్వామికి పంచెలను ఇవ్వడం మా అదృష్టం



తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామికి ఏరువాడ జోడు పంచెలను అందించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది రాజవంశీయులలో ఒకరినైన నేను స్వామివారికి పంచెలను అందించడం అదృష్టంగా భావిస్తున్నాను.

- కృష్ణ రాంభూపాల్, గద్వాల రాజవంశీయులు

అధిక వసూళ్లు చేస్తే చర్యలు

- మీ సేవా నిర్వాహకుల సమావేశంలో అదనపు కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పీ అమరేందర్

కందనూలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మీ సేవా కేంద్రాల్లో అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ పీ అమరేందర్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నాగర్‌కర్నూల్ జిల్లాలోని 128 మీ సేవా కేంద్రాల నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ సేవా కేంద్రాల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమించి అధికంగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఏర్పాటు నుంచి 56 మీసేవా కేంద్రాల నిర్వాహకులు అధిక వసూళ్లకు పాల్పడుతున్నట్లు నిర్ధారణ అయ్యిందని తెలిపారు. కొన్ని కేంద్రాలు తప్పుడు ధ్రువపత్రాలను సమర్పించి అధిక వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ వద్ద సమాచారం ఉందన్నారు. మీ సేవా కేంద్రాల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో 26ఆధార్ కేంద్రాలు ఉన్నాయని, మరిన్ని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో మీ సేవా కేంద్రాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై కేంద్రం దాడి

- రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రజనీకాంత్ , నాగరాజు

6

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ సంతోష్



డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

గద్వాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల పట్టణంలోని జిల్లా దౌదర్‌పల్లి దగ్గర నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పెండింగ్ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్ర డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పరిశీలించారు. సెప్టెంబరు మొదటి వారంలో గృహ ప్రవేశాలు ఉంటాయని, ఆలోపు పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. దౌదర్‌పల్లిలో 715 ఇళ్లు నిర్మించారని, వాటికి విద్యుత్, తలుపులు, పెయింటింగ్ పనులు పూర్తికావాలని సూచించారు. ప్రధాన రహదారి నుంచి ఇళ్ల వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల పరిసర ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టి పచ్చదనం పెంపొందించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, గృహ నిర్మాణ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, డీఈ కాశీనాథ్, ఈఈ దామోదర్, విద్యుత్ శాఖ డీఈ తిరుమలరావు, మున్సిపల్ కమిషనర్ జానకిరాములు తదితరులు ఉన్నారు.

కేసరి సముద్రంలో వాటర్‌బోటు ప్రారంభం

- ప్రారంభించిన కలెక్టర్ సంతోష్, ఎస్పీ

నాగర్‌కర్నూల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కేసరి సముద్రంలో వాటర్ బోట్‌ను నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా ప్రమాదంలో నీట మునిగినా.. ప్రమాదవశాత్తు నీటిలో పడినా అత్యవసర సమయంలో వారిని కాపాడేందుకు ఈ బోటు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ జగన్, రాఘవరావు, ఆర్‌ఎస్‌ఐ గౌస్‌పాష తదితరులు పాల్గొన్నారు.



కేసరి సముద్రంలో వాటర్‌బోటులో ప్రయాణిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ



ఆత్మకూరు ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

యూరియా కోసం తప్పని నిరీక్షణ

- పీఏసీఎస్‌ల వద్ద బారులు తీరుతున్న రైతులు
- ఆత్మకూరు, కొత్తకోటలలో బీఆర్‌ఎస్ ధర్నా
- ఒక రోజు ముందు నుంచే క్యూ కడుతున్న రైతులు

7

పింఛన్ల పంపిణీకి ముఖ గుర్తింపు

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందించే పింఛన్లు ముఖ గుర్తింపు ద్వారా అందజేయనున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. సోమవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల ద్వారా తపాల సిబ్బందికి ముఖ గుర్తింపునకు సంబంధించి 74 సెల్ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో 71 వేలకు పైగా పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని, దాదాపు సగం మంది ప్రతీనెల నేరుగా తమ బ్యాంకుల ద్వారా తీసుకుంటున్నారని తెలిపారు. మిగిలిన వారికి గ్రామాల్లోని తపాల కార్యాలయంలో పింఛనను ఇస్తున్నట్లు వివరించారు. కొంత మందికి ఆధార్ కార్డు ప్రకారం వేలి ముద్రల గుర్తింపు జరగక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఇక నుంచి సెల్ ఫోన్‌లో ప్రత్యేక యాప్ డౌన్లోడ్ చేసుకొని ముఖ గుర్తింపు ద్వారా పింఛన్లు అందజేయనున్నట్లు వివరించారు.

వన మహోత్సవంపై వీడని నిర్లక్ష్యం

- మొక్కలు నాటడంపై కనిపించని చిత్తశుద్ధి
- అనుకూలమైన వాతావరణం ఉన్నా పట్టించుకోని అధికారులు



వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పెబ్బేరులో మొక్కలు నాటుతున్న అధికారులు (ఫైల్)

వనపర్తి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పచ్చదనంతో పాటు అటవీ విస్తీర్ణం పెంపొందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆయా శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాలను నిర్దేశించింది. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు మాత్రమే మొక్కలు నాటుతుండగా మిగ తా శాఖల ఆధ్వర్యంలో ఇప్పటికీ ఒక్క మొక్క కూడా నాటలేదు. జిల్లాలో ఈ ఏడాది మొత్తం 21.70 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం ఉన్నప్పటికీ కేవలం 15,75,879 మొక్కలు నాటినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ ఈ ఏడాది వన మహోత్సవం కార్యక్రమాన్ని ఎక్కడ కూడా సరిగా నిర్వహించలేదని, మొక్కలు ఎక్కడ నాటారో కూడా తెలియదని పలువురు విమర్శిస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో కనిపించని మొక్కలు

2025-26 సంవత్సరానికి గాను వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 21.70 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు గాను వీటిని నిర్దేశించారు. అత్యధికంగా గ్రామీణాభివృద్ధి శాఖకు 11,54,800, పంచాయతీరాజ్ శాఖకు 3.50లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టారు. ఇప్పటి వరకు ఈ రెండు శాఖల ఆధ్వర్యంలో మాత్రమే మొక్కలు నాటుతున్నారు. గ్రామీణాభివృద్ధిశాఖ 10.46లక్షల మొక్కలు, పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో 3.50లక్షల మొక్కలు, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో 22వేల మొక్కలు నాటినట్లు అధికారులు చెబుతున్నారు. మిగతా శాఖల ఆధ్వర్యంలో నేటికీ ఒక్క మొక్క కూడా నాటలేదు. ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం 21,70,600 మొక్కలు కాగా ఇప్పటి వరకు 15,75,879 మొక్కలు నాటినట్లు ఆయా శాఖల అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడ మొక్కలు నాటిన ఆనవాళ్లు కనిపించడం లేదు.

నిర్వాసితులకు.. త్వరలో ఇళ్ల స్థలాలు

» పట్టాల పంపిణీకి ఏర్పాట్లు
» పూర్తి చేసిన అధికారులు

జడ్చర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించనున్న ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న తండాలు, ఊర్లకు చెందిన నిర్వాసితులకు త్వరలో ఇళ్ల స్థలాలకు సంబంధించిన పట్టాలను పంపిణీ చేయనున్నారు. అందుకోసం అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణానికి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల, నవాబ్‌పేట మండలాల్లో దాదాపు 5,100 ఎకరాలకు పైచిలుకు పట్టా భూములతో పాటు, ప్రభుత్వ భూమిని సేకరించారు. రిజర్వాయర్ నిర్మాణంలో ఉదండాపూర్, వల్లూరు గ్రామాలతో పాటు తుమ్మలకుంటతండా, శ్యామగడ్డతండా, చిన్నగుట్టతండా, ఒంటిగుడిసె తండా, రేగడిపట్టితండాలు ముంపునకు గురవుతున్నాయి. నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు అధికారులు జడ్చర్ల మండలంలోని దేవునిగుట్టతండా సమీపంలో దాదాపు 300 ఎకరాల భూమిని సేకరించారు. పునరావాసం కింద పీడీఎఫ్ (ప్రాజెక్ట్ డిజాస్టర్ ఫ్యామిలీ) కింద ఒక్కో కుటుంబానికి 300 గజాల స్థలాన్ని కేటాయించనున్నారు. అందుకు సంబంధించిన లేఅవుట్‌ను ఇప్పటికే సిద్ధం చేసి, గ్రామాల వారీగా కేటాయించారు. పునరావాసం కేంద్రాల్లో వాటర్ ట్యాంకులు, డ్రైనేజీల నిర్మాణం, విద్యుత్‌లైన్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. పాఠశాలలు, కమ్యూనిటీ భవనాలు, దేవాలయాలు, పార్థనా మందిరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను నిర్మించాల్సి ఉంది.

తొలి విడతలో 338 మందికి పట్టాలు

రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న 5 తండాల చెందిన 338 మందికి పునరావాసం కింద ఇళ్ల పట్టాలను అందించనున్నారు. తొలి విడతలో తుమ్మలకుంటతండాకు చెందిన 104 మందికి, రేగటిపట్టితండాకు చెందిన 75 మందికి, చిన్నగుట్టతండాకు చెందిన 53 మందికి, ఒంటిగుడిసెల తండాకు చెందిన 11 మందికి, శ్యామగడ్డతండాకు చెందిన 95 మందికి పట్టాలను అందించనున్నారు. మలివిడతలో వల్లూరు, ఉదండాపూర్ గ్రామాల నిర్వాసితులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేయనున్నారు.


జడ్చర్ల మండలం దేవునిగుట్టతండా సమీపంలో నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు లేఅవుట్ చేసిన ప్లాట్లు

సొంతంగా ప్లాట్ల కేటాయింపు

ముంపు గ్రామమైన తుమ్మలకుంటావాసులు పునరావాస కేంద్రంలో ఇళ్ల పాట్లను సొంతంగా కేటాయించుకున్నారు. వారు స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్, ఆర్డీవోలకు సమాచారం అందించి విషయాన్ని తెలిపారు. గతనెల 25న తండావాసులందరూ ఎకమై చర్చించుకున్నారు. ఇళ్లస్థలాలను స్వచ్ఛందంగా కేటాయించుకున్నారు. మిగతా వారు కూడా ఇళ్ల స్థలాలను కేటాయించుకునేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం.

పట్టాల పంపిణీకి ఏర్పాట్లు



ఉదండాపూర్ రిజర్వాయ ర్‌లో ముంపునకు గురైన తండావాసులకు మొదటి విడతగా ఇళ్ల స్థలం పట్టాల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశాం. త్వరలోనే వారికి అందించనున్నాము. ఆ తర్వాత వల్లూరు, ఉదండాపూర్ గ్రామాల నిర్వాసితులకు పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- నర్సింగ్‌రావు, జడ్చర్ల తహసీల్దార్

జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

» కిక్ బాక్సింగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రవికుమార్


జాతీయ స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో జిల్లా అధ్యక్షుడు రవికుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించాలని కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నయ్‌లో ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు జిల్లాకు చెందిన ఓంకార్, శివప్రసాద్, రేవంత్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన వారిని అభినందించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

» మహబూబ్‌నగర్ డీవైఎస్‌వో శ్రీనివాస్


విలువిద్యలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. ఇటీవల డిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి విలువిద్య పోటీల్లో జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు స్మృతి సన్నిభ బంగారు, కృతిక్ శ్రీవత్సవ్ వెండి, కాంస్య పతకాలను సాధించారు. ఈ సందర్భంగా సోమవారం క్రీడా శాఖ కార్యలయంలో డీవైఎస్‌వో వారిని అభినందించారు. జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తాం

» అథ్లెటిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర


రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ టోర్నీ టీషర్టులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తామని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర అన్నారు. పాలమూరు యూనివర్సిటీలోని సింథటిక్ ట్రాక్‌లో ఈ నెల 30, 31వ తేదీల్లో జి.రాజేంద్రప్రసాద్ స్మారక 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్-14, 16, 18, 20 జూనియర్ బాల, బాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు సోమవారం సురేశ్‌బాబు క్రీడా దుస్తులను అందించారు. అనంతరం శరత్‌చంద్ర మాట్లాడుతూ టోర్నీలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 1,200 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలను సాధించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శులు సీ. శ్రీనివాసులు, పి. శ్రీనివాసులు, కోచ్ సునీల్‌కుమార్, పీడీలు దత్తాత్రేయ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటే టోర్నీలో విద్యార్థుల ప్రతిభ


నేషనల్ కరాటే టోర్నీలో పతకాలు సాధించిన విద్యార్థులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మహబూబ్‌నగర్ పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థులు 7 బంగారు. 2 రజత, 1 కాంస్య పతకాలను సాధించారని డ్రాగన్ షోటోకాన్ మహబూబ్‌నగర్ అర్బన్ అధ్యక్షుడు ఎస్‌కే మోసిన్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను కరస్పాండెంట్ రాఘవేందర్ అభినందించారు.

హెచ్‌సీఏ 2లీగ్‌లో రాణించిన జిల్లా క్రీడాకారులు

» తొలి ఇన్నింగ్స్‌లో 331 పరుగులకు ఆలౌట్


అర్ధసెంచరీతో రాణించిన అబ్దుల్‌రాఫె

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) 2లీగ్ టోర్నీలో జిల్లా జట్టు క్రీడాకారులు రాణించారు. సోమవారం హైదరాబాద్‌లోని శంషాబాద్ కేసీఆర్-2 క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న 2డే క్రికెట్ లీగ్‌లో మహబూబ్‌నగర్-ఖమ్మం జట్లు తలబడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు మొదటి ఇన్నింగ్‌లో 87.1 ఓవర్లలో 331 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో అబ్దుల్ రాఫె 73, చత్రపతి 63, కేతన్‌కుమార్ 62 అర్ధసెంచరీతో రాణించారు. బ్యాటింగ్‌లో రాణించిన జిల్లా క్రీడాకారులు జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ రాజశేఖర్ అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటితే రాష్ట్ర జట్టులో చోటు లభిస్తుందని క్రీడాకారులకు సూచించారు.

దళిత ఉద్యోగులపై చిన్నచూపు

- ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్


విద్యుత్ భవన్ ఎదుట ఆందోళన చేపట్టిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు

పాలమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో దళిత ఉద్యోగులపై చిన్నచూపు ప్రదర్శించడాన్ని సహించబోమని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, టి.గంగాధర్, హన్సేన్ హెచ్చరించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ సభ్యులు రికార్డు అసిస్టెంట్ పదోన్నతుల కోసం ఆరు నెలలుగా విన్నవిస్తున్నా, ఎస్ఈ పి.వెంకటరమేశ్ నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇదే నిర్లక్ష్యాన్ని ఇతర సంఘాలపై ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడే దళిత ఉద్యోగులను మాత్రమే కారకులను చేస్తారా..? అని నిలదీశారు. నారాయణపేట జిల్లా ఏర్పాటై మూడేళ్లు అవుతున్నా, కేటాయించిన ఉద్యోగులను అక్కడికి పంపించకుండా, ఇక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా వేతనాలు ఇవ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఉన్నతాకారులు మూడేళ్ల క్రితమే ఆదేశాలు జారీ చేసినా, ఎందుకు రిలీవ్ చేయడం లేదో ఎస్ఈ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ పోలీసు అధికారులు సీఐ మహేశ్వరరావు, ఎస్ఐ మదన్‌మో హన్, సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీజీఎస్‌పీడీసీఎల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌బాబు, కార్యదర్శి బీచుపల్లి, రఘునాథ్, రామకృష్ణ, తిరుపతయ్య, మహేశ్, గోవిందు, వెంకట్రాములు పాల్గొన్నారు.

పర్యవేక్షణ.. కరువు

(5వ పేజీ తరువాయి)

డీఈవోలు 12 పాఠశాలలు, మండల పరిధిలోని ఎంఈవో 16 పాఠశాలలను, కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి పరిధిలోని 20 పాఠశాలలను తప్పని సరిగా పర్యవేక్షించాలి. పాఠశాల సమయంలో ఉన్న ఎనిమిది క్లాసులలో ఎప్పుడైనా పర్యవేక్షించవచ్చు. పాఠశాల రికార్డులు పరిశీలించాలి... విద్యార్థుల తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో కూర్చొని ఉపాధ్యాయులు బోధిస్తున్న విషయాలను వినాలి. పాఠ్యప్రణాళికను అనుసరించి బోధిస్తున్నడా లేదా అన్న అంశాలను పరిశీలించాలి. అక్కడ విన్న పాఠం విద్యార్థులకు అర్థం అయ్యేవిధంగా ఉందా... లేదా అన్న విషయాలను కూడా విద్యార్థులతో మాట్లాడాలి. తరగతి గదిలో విద్యార్థులతో గడిపిన సమయంలో ఎలాంటి విషయాలు గమనించారు? విద్యార్థుల బోధన ఎలా సాగుతున్నది అన్న విషయాలను తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో అక్కడికక్కడే నమోదు చేయాలి.

ఉమ్మడి జిల్లాలో 215 కాప్లెంక్స్ పాఠశాలలు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 215 కాంప్లెక్స్ పాఠశాలలు ఉన్నాయి. ఆ పాఠశాలల్లో పని చేసే ప్రధానోపాధ్యాయులు వారి కాంప్లెక్ పరిధిలోని పాఠశాలలను తనిఖీ చేయాలి. కానీ పలు కారణాలు చూపుతూ అనుకున్న స్థాయిలో తనిఖీలు చేయడం లేదు. ఆ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు తనిఖీ చేసి అక్కడ వెళ్లిన సమయంలో తప్పనిసరిగా వివరాలను యాప్‌లో నమోదు చేయాలి. కానీ ఈ పర్యవేక్షణ అంతంత మాత్రంగానే జరుగుతున్నది. అదేవిధంగా అన్ని మండలాల ఎంఈవోలు కూడా అనుకున్న విధంగా పాఠశాలలను పరిశీలించడం లేదు. ఇందులో ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ఎంఈవోలు ఉండగా మిగతా వారంతా జీహెచ్‌ఎంలే ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. ఇటు ఎంఈవో బాధ్యతలు, హెచ్‌ఎం బాధ్యతలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం బాధ్యతలు నిర్వహించాలంటే కొంత ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. మహబూబ్‌నగర్ 53, నాకర్‌కర్నూల్ 57, నారాయణపేట 35, వనపర్తి 25, జోగుళాంబ గద్వాల జిల్లాలో 45 కాంప్లెక్స్ పాఠశాలలు ఉన్నాయి.

పాఠశాలలపై పర్యవేక్షణ చేయాల్సిందే

అందరు ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విద్యాశాఖ సూచించిన విధంగా తమ పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షించాలి. ఎంఈవోలు కూడా నిబంధనల ప్రకారం తనిఖీలు చేయాలని గతంలోనే ఆదేశించాం. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయి.

- ప్రవీణ్‌కుమార్, డీఈవో, మహబూబ్‌నగర్

విద్యారంగంపై కేంద్రం దాడి

» ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య
» ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలి
» రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రజనీకాంత్ , నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య

కొల్లాపూర్ , ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక విద్యారంగంపై దాడి ప్రారంభించిందని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు శ్రీజన్ భట్టాచార్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటంలోని శ్రీవారి సముద్రం సమీపంలో ఉన్న ప్రైవేటు కాటేజీలో సోమవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమావేశాలు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి శ్రీజన్ భట్టాచార్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ చరిత్రను పాఠ్యాంశాల నుంచి తొలగించి, స్వాతంత్ర్య ఉద్యమంలో ఎలాంటి పాత్రా లేని సావర్కర్ లాంటి వారి జీవిత చరిత్రను పొందు పరుస్తోందన్నారు. బీజేపీ నియంత పాలనను ప్రశ్నించినందుకు సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు ఫెలోషిప్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రజనీకాంత్, నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఇవ్వాల్సిన రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్, పూజ, ప్రశాంత్, శంకర్, రాష్ట్ర సహ కార్యదర్శులు శ్రీకాంత్, ప్రశాంత్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ తారా సింగ్, జిల్లా కమిటీ సభ్యులు రామార్జున, చరణ్, కార్తీక్, చిన్న, కార్తీక్, హేమంత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ఎలుకల బెడద

» కరవడంతో విద్యార్థులకు గాయాలు
» శాంతినగర్ ఎంజేపీలో ఘటన

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, శాంతినగర్ మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులను ఎలుకలు కరిచి గాయపరిచాయి. పాఠశాల రెండవ అంతస్తులో 8, 9వ తరగతులకు చెందిన విద్యార్థులు అక్కడే చదువుకుని, అక్కడే పడుకుంటారు. గత నాలుగైదు రోజులుగా రాత్రి వేళ నిద్రపోతున్న వారిని ఎలుకలు కరుస్తున్నాయి. దుప్పటి కప్పుకున్నా, అందులోకి దూరి చేతులు, కాళ్ల వేళ్లను కొరుకుతున్నాయి. దీంతో వారు భోజనం చేయలేకపోతున్నారు. నడిచేందుకు ఇబ్బంది పడుతున్నారు. అలాగే గ్రౌండ్ ఫ్లోర్‌లోని పెట్టెల సందుల్లో ఎలుకలు ఆవాసాలు ఏర్పరుచుకొని, రాత్రి వేళ గదుల్లోకి వస్తున్నాయని వారు తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ రామకృష్ణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఈ విషయాన్ని విద్యార్థులు కూడా తమ దృష్టికి తెచ్చారని ఆయన తెలిపారు.

రాబిట్ ప్యాడ్లు, బోన్లు ఏర్పాటు చేసి ఎలుకలను నియంత్రిస్తామని తెలిపారు.


ఎలుకలు కరవడంతో ఆసుపత్రికి వెళ్తున్న విద్యార్థులు

మట్టి 'కొట్టేస్తున్నారు'

» ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి అక్రమంగా తరలింపు
» గ్రామస్థులు అడ్డుకున్నా ఆగని దందా

జడ్చర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : అక్రమార్కులు మట్టిని కూడా వదిలిపెట్టడం లేదు. కొందరు నాయకుల అండతో యథేచ్ఛగా మట్టిని తరలించుకుపోతున్నారు. వారికి కొందరు నాయకులు వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపణలున్నాయి. అధికారులు కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఉదండాపూర్ ప్రాంతం అందుకు వేదికగా మారింది. రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న ఉదండాపూర్, వల్లూరు గ్రామాల శివారులో ఎర్రమట్టి భూములు అధికంగా ఉన్నాయి. మట్టి వ్యాపారుల కన్ను ఆ భూములపై పడింది. దీంతో ఇప్పటికే వేలాది టిప్పర్ల మట్టిని కొట్టుకుపోయిన అక్రమార్కులు, మూడు ట్రాక్టర్లు... ఆరు టిప్పర్లు అన్న చందంగా సొమ్ము చేసుకుంటున్నారు. ఉదండాపూర్, వల్లూరు గ్రామాల్లోని ప్రధాన రహదారుల గుండా టిప్పర్లలో మట్టిని తరలించుకుపోతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది టిప్పర్లు తిరుగుతుండటంతో రహదారులు దెబ్బతిన్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో దుమ్ము, ధూళితో అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులకు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు నాయకులు వంత పాడుతున్నట్లు విమర్శలున్నాయి. వారి అండతోనే మట్టి దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. మట్టిని తరలిస్తున్న టిప్పర్‌లను పట్టుకుని అధికారులకు అప్పగించినా, చర్యలు తీసుకోవడంలేదంటూ వల్లూరు, ఉదండాపూర్ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. టిప్పర్ పట్టుకుని అధికారులకు ఫోన్ చేసి చెప్పినా స్పందించడం లేదని చెప్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


జడ్చర్ల మండలం ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్


టిప్పర్‌లో ఉన్న మట్టి

పదోన్నతుల వెబ్ ఆప్షన్ ఆలస్యం

» ఇబ్బందులు పడిన ఉపాధ్యాయులు


ఉపాధ్యాయుల సర్వీస్‌బుక్‌లు పరిశీలిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి ఉపాధ్యాయులు తమకున్న ఖాళీల్లో అనుకూలమైన పాఠశాల ఎంపిక చేసుకునేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచే వెబ్ ఆప్షన్ ఆవ్వాలని అధికారులు మొదట సూచించారు. కానీ ఉదయం నుంచి వెబ్ ఆప్షన్ ఇచ్చేందుకు చాలా మంది ఉపాధ్యాయులు ప్రయత్నించినా.. అసౌకర్యం కలగడంతో పదోన్నతుల జాబితాలో పేర్లు ఉన్న ఉపాధ్యాయులు ఇబ్బందిపడ్డారు. జిల్లా అధికారులకు ఫోన్ చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అప్పుడు ఇప్పుడు వస్తాయంటూ సాయంత్రం వరకు చెప్పుకొచ్చారు. చివరికి రాత్రి 8 గంటల నుంచి పదోన్నతులకు సంబంధించి ఆప్షన్ ఇవ్వాలని సంబంధిత ఉపాధ్యాయుల ఫోన్‌కు మెసేజీలు వచ్చాయి. రాత్రి 12 గంటలలోపు ఈ ఆప్షన్ ఇచ్చేందు అవకాశం ఉందని అందులో పేర్కొన్నారు. తెల్లవారుజాము వరకు ఏదైన ఆప్షన్ తొలగించుకోవచ్చని ఆ తర్వాత అవకాశం ఉండదని విద్యాశాఖ అధికారులు సూచించారు. దీంతో రాత్రి 8 గంటల నుంచి సబ్జెక్టు వారీగా ఖాళీగా ఉన్న పాఠశాల వివరాలను ఆప్షన్ ఇచ్చారు. కాగా జిల్లాలో పోస్టులకు సంబంధించి తుది జాబితా సిద్ధం చేసి పాఠశాల విద్యాశాఖ అధికారులకు జిల్లా అధికారులు పంపించారు. అది ఫైనల్ కావడంతో సీనియార్టీ, రోస్టర్ పాయింట్ల ఆధారంగా కొన్ని సబ్జెక్టుల్లో చిన్న మార్పులు జరిగాయి. అయితే కొందరు ఉపాధ్యాయులు తోటి ఉపాధ్యాయులకు గత జాబితాలో తనపేరుపై ఉందని, ఇప్పుడు నీ పేరు పైకి ఎలా వచ్చిందని నీపై ఫిర్యాదు చేస్తామంటూ ఫోన్‌చేసి బెదిరించారు. మరి కొందరు ఫలానా ప్లేస్ నేను తీసుకుంటా.. నీవు ఆ ప్లేస్ ఆప్షన్ ఇవ్వద్దూ అంటూ చెప్పడం కలకలం రేపింది. ఈ విషయం డీఈవో వరకు వెళ్లింది. జిల్లా మొత్తం 167 పోస్టులు పదోన్నతులకు నోటిఫై చేయగా అందులో 110 పోస్టులకు మాత్రమే పదోన్నతుల పొందనున్నట్లు సూపరింటెండెంట్ శంభుప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించి పదోన్నతుల ఉత్తర్వులు మంగళవారం సాయంత్రంలోపు రానున్నట్లు తెలిపారు.

పెద్దపులి స్వేచ్ఛా విహారం

- నల్లమలలోని నవాబ్ బంగ్లా వద్ద దర్శనం

మన్ననూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతంలో సోమవారం ఓ పెద్దపులి స్వేచ్ఛగా విహరిస్తూ అటవీశాఖ అధికారుల కంట పడింది. విధుల్లో భాగంగా మన్ననూరు అటవీ రేంజ్ అధికారి వీరేశ్, అధికారులు, సిబ్బందితో కలిసి పర్హాబాద్ చౌరస్తా నుంచి అడవిలోకి వెళ్తుండగా నిజాం నవాబు బంగ్లా (షీకారీ ఘర్) ప్రాంతంలో పెద్దపులి రోడ్డు దాటుతూ కనిపించింది. దీంతో వారు సెల్‌ఫోన్లలో వీడియోలు తీశారు. ప్రస్తుతం వన్యప్రాణుల సంతానోత్పత్తి సమయం కావడంతో సెప్టెంబర్ 30 వరకు సఫారీ టూర్‌ను రద్దు చేశారు. దీంతో పెద్దపులులు అడవిలో స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రాజాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి గ్రామంలోని సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన అంజాద్ ఖాన్ (35) మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ముదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య జహీర బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మూడావత్ స్వాములు (ఫైల్)

అచ్చంపేట రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలంలోని బొల్లట్‌పల్లి గ్రామంలో ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన మూడావత్ స్వాములు (60) ఆదివారం రాత్రి పొలానికి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూశారు. అక్కడ స్వాములు విద్యుదాఘాతంతో మృతి చెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఇందిర తెలిపారు.

మద్యానికి బానిసై కర్ణాటక వాసి మృతి

నారాయణపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై నారాయణపేట జిల్లాలోని పాత గంజ్ ప్రాంతంలో నివాసముంటున్న కర్ణాటక రాష్ట్రం నసలవాయి గ్రామానికి చెందిన గొడుగు శివ(38) సోమవారం మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గొడుగు శివ హైదరాబాద్‌లో కొంతకాలంగా హోటల్‌లో పని చేస్తూ నాలుగు రోజుల క్రితం నసలవాయి గ్రామానికి వచ్చాడు. ఈనెల 20న గ్రామం నుంచి పేటకు వచ్చి గ్రామానికి తిరిగి రాలేదని భార్య రాధమ్మ తెలిపింది. తాగుడుకు బానిసైన శివ పాతగంజ్ వద్ద మృతిచెంది కన్పించాడని ఆ గ్రామానికి చెందిన జగ్గప్ప తమకు తెలిపినట్లు ఎస్‌ఐ వివరించారు. కొంతకాలంగా తాగుడుకు బానిసై భోజనం చేయక, నీరు సైతం తాగక గొంతు ఎండిపోయి మృతి చెందినట్లు భార్య రాధమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మరికల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను నారాయణపేట జిల్లా ధన్వాడ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం తెల్లవారుజామున కొండాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల చౌరస్తాలో ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ధన్వాడ పోలీసు సిబ్బంది తిరుమలేష్‌గౌడ్, తిరుపతిరెడ్డి ఆపి తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ డ్రైవర్ పసుల నారాయణ, యజమాని ప్రభాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

భార్య హత్య కేసులో భర్తకు రిమాండ్

మహబూబ్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : భార్య హత్య కేసులో భర్తను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో ఉంటున్న శ్రావణి (27)ని ఈనెల 21న భర్త శ్రీశైలం సోమశిలకు వెళ్దామని తీసుకెళ్లాడు. పథకం ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని సాతాపూర్ అడవిలోకి తీసుకెళ్ళి కత్తితో పొడిచి చంపి, పెట్రోల్ పోసి తగులపెట్టాడు. ఆదివారం రాత్రి నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భార్యపై అనుమానంతో చంపినట్లు నిందితుడు అంగీకరించాడు. దీంతో టూటౌన్ పోలీసులు సోమవారం అతడిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్ నిమిత్తం జిల్లా జైలుకు తరలించారు. తల్లి హత్యకు గురికావడం, తండ్రి జైలుకు వెళ్లడంతో వారి ఇద్దరు పిల్లలు దిక్కులేని వారయ్యారు.

కొనసాగుతున్న డిగ్రీ, పీజీ పరీక్షలు


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని పీజీ, బీఎడ్, బీపీఎడ్ నాల్గవ సెమిస్టర్, డిగ్రీ 6వ సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌వీడీసీ కాలేజీలోని పరీక్ష కేంద్రాలను పీయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ తనిఖీ చేసి, కాపియింగ్ పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిట్టింగ్ స్క్వాడ్స్ రంగప్ప, డాక్టర్ వేణు, ప్రిన్సిపాల్ కుమారస్వామి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టడం సరికాదు

» ఐజీపీని కలిసిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యే ఆల

భూత్పూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : హుందాగా వ్యవహరించాల్సిన కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలపై కక్షపూరిత కేసులు పెట్టడం అమానుషమని మాజీ మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం హైదబాద్‌లోని ఐజీపీ తఫ్సీర్ ఇక్బాల్‌ను కలిసి, మాట్లాడారు. అధికారం ఉందని చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలను లొంగదీసుకోవాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు కేసులు పెట్టి అరెస్టులు చేయించడం దారుణం అన్నారు. బీఆర్ఎస్ దేవరకద్ర మండలాధ్యక్షుడు జెట్టి నర్సింహ్మారెడ్డిపై కాంగ్రెస్ నాయకులు అక్రమ కేసు పెట్టి అరెస్టు చేయించడం సమజసం కాదని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు.

గ్రామ బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

» కలెక్టరేట్ ముందు బాధితుడి ఆందోళన


తమ కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేసిన వారిని శిక్షించాలని కోరుతున్న పెద్ద బుచ్చన్న

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నా కుటుంబాన్ని కుల, గ్రామ బహిష్కరణ చేసిన వారిపై చట్టపరమైన తీసుకోవాలని కోరుతూ జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలంలోని కుర్విరావుల్‌చెర్వు గ్రామానికి చెందిన పెద్దబుచ్చన్న కోరాడు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ఆయన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ మాజీ సర్పంచు జయమ్మ, ఆమె భర్త లక్ష్మన్న, కుమారుడు తిమ్మప్ప తన కుటుంబాన్ని కుల, గ్రామ బహిష్కరణ చేశారన్నారు. తమ ఇంటి పక్కనున్న ఖాళీ స్థలాన్ని ఇవ్వకపోవడంతో కక్ష్య సాధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. చర్చి సంఘం పెద్దలు కూడా తమను బహిష్కరించారని తెలిపారు. దీంతో మూడేళ్ల క్రితం నా మనుమరాలు చనిపోయినా అంత్యక్రియలు చేసేందుకు పాస్టర్ రాలేదన్నాడు. తన కుమార్తె వివాహానికి ఇంటింటికి వెళ్లి పిలిచినా ఎవరూ రాలేదని, పాస్టర్ కూడా రాకపోవడంతో కుటుంబ సభ్యులతో కలిసి పెళ్లి చేశామని తెలిపారు. తమపై ఇంత దారుణంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కుక్కలంటే మాకు ప్రాణం



» కన్న బిడ్డల్లాగా పెంచుకుంటాం
» పుట్టిన రోజులు, సీమంతాలు చేస్తాం
» ఖరీదైన ఆహారం పెడతాం
» అంటున్న యజమానులు

● నేడు జాతీయ కుక్కల దినోత్సవం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం)/ అచ్చంపేట/ కోడేరు/ పెద్దకొత్తపల్లి/ నారాయణపేట/ కల్వకుర్తి/కందనూలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కుక్కలంటే తమకు ప్రాణమని, కన్న బిడ్డల్లాగా చూసుకుంటామని పెంపకందారులు చెప్తున్నారు. వేలు, లక్షల రూపాయలు పెట్టి జాతి కుక్కలను కొనుగోలు చేస్తున్నారు. ప్రత్యేక ఆహారం అందిస్తూ, వసతులు కల్పిస్తూ జాగ్రత్తగా పెంచుకుంటున్నారు.

వాటిని కుటుంబ సభ్యులుగా భావించి పుట్టిన రోజులు, సీమంతం వేడుకలను నిర్వహిస్తున్నారు. నేడు జాతీయ కుక్కల దినోత్సవం సందర్భంగా కొందరు కుక్కల పెంపకందారులతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడింది. వారు పెంచుకుంటున్న కుక్కల ప్రత్యేకతలు, వాటితో అనుబంధం తదితర అంశాలపై ప్రత్యేక కథనం..

కన్న పిల్లల్లా చూసుకుంటాం



కుక్కలను తాము కన్న పిల్లల్లా చూసుకుంటామని నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలం చెర్లతిర్మలాపూర్ మాజీ సర్పంచు ముచ్చునూరు రవీందర్ గౌడ్ తెలిపారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నివసిస్తున్న ఆయన రెండు కుక్కలు ప్రేమగా పెంచుకుంటున్నారు. వాటికి ప్రతీరోజు వాటికి ఉదయం పాలు, బిస్కెట్, మధ్యాహ్నం అన్నం, చికెన్, రాత్రికి గుడ్లు, పాలు ఇస్తాను. అందుకు ప్రతీ నెల రూ. 3 వేల వరకు ఖర్చు అవుతుంది. ముందు వాటికి తినిపించిన తర్వాతే మేము భోజనం చేస్తాం.

- ముచ్చునూరు రవీందర్, చెర్లతిర్మలాపూర్

వీధి కుక్కలకు ప్రతీ రోజు ఆహారం



మహబూబ్‌నగర్ పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన శ్వేతా సింగ్ దంపతులకు కుక్కలంటే చాలా ప్రేమ. వారికి పిల్లలు లేకపోవడంతో మూగ జీవాలనే తమ పిల్లలుగా భావిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వీధికుక్కలకు ఆహారం ఇస్తున్నారు. ఎక్కడైనా కుక్కలు అనారోగ్యంతో, చర్మవ్యాధుల బారిన పడితే వాటిని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. చిన్న కుక్క పిల్లలు కనిపిస్తే ఇంటికి తీసుకెళ్తున్నారు. వాటిని పెంచి పెద్ద చేసి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించి వదిలేస్తున్నారు. అందుకోసం వారు తమ జీతంలో సగం వ రకు ఖర్చు చేస్తున్నారు.

- శ్వేతా సింగ్ దంపతులు

డాబర్‌మాన్‌తో ఇంటికి రక్షణ



తాము పెంచుకుంటున్న డాబర్‌మాన్ ఇంటికి రక్షణగా ఉంటోందని నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల కేంద్రానికి చెందిన డి.బాలకృష్ణ తెలిపారు. హైదరాబాద్‌లో ఒక మగ, ఒక ఆడ డాబర్‌మాన్ కుక్కలను రూ.36 వేలకు కొనుగోలు చేశానని అన్నారు. ఇందులో ఆడ కుక్క చనిపోగా, మగ కుక్క ఉందని తెలిపారు. ప్రతీ రోజు 50 గ్రాముల పెడిగ్రీ, అడల్ట్ ఆహారం ఇస్తున్నట్లు చెప్పారు. ఇది కొత్తవారిని ఇంటి దరిదాపులకు కూడా రానివ్వదని చెప్పారు. ఇది మా ఇంట్లో ఉండటం వల్ల భయం లేకుండా జీవిస్తున్నామని తెలిపారు.

- బాలకృష్ణ, కోడేరు

జంట కుక్కలు సింబి, సింబా



నారాయణపేటకు చెందిన హనుమాన్‌ధరక్ జర్మన్ షెపర్డ్ జాతికి చెందిన జంట కుక్కలను పెంచుతున్నారు. వాటిని 2021లో హైదరాబాద్ నుంచి తెచ్చుకున్న అతడు సింబా, సింబి అని పేరు పెట్టారు. వాటికి ఉదయం, రాత్రి పెరుగు అన్నంతో పాటు డాగ్ ఫుడ్ అందిస్తున్నారు. ప్రతీ రోజు మూడు పూటలా వాకింగ్‌కు తీసుకెళ్తారు. ప్రతీ సంవత్సరం పుట్టిన రోజు వేడుకలను కూడా ఘనంగా చేస్తున్నారు.

- హనుమాన్‌ధరక్, నారాయణపేట

13 ఏళ్లుగా కుక్కల పెంపకం

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అప్పన్నపల్లికి చెందిన వికాస్ 13 సంవత్సరాల నుంచి వివిధ జాతుల కుక్కలను పెంచుతున్నాడు. ఆసక్తి ఉన్న వారికి విక్రయిస్తున్నాడు. పాలమూరులో 2021లో నిర్వహించిన డాగ్‌షోలో అతడి పెంపుడు కుక్క రుద్ర రెండవ బహుమతి సాధించింది. ప్రస్తుతం అతడి వద్ద బెల్జియం మాలినోయిస్, జర్మన్ షెపర్డ్, హస్కీ, రాట్‌విల్లర్, సిజ్జు, లాబ్రడార్ జాతుల కుక్కలున్నాయి.



ఒత్తిడి దూరం చేసే సిస్కో, చిచ్చు



సిస్కో, చిచ్చులు తమను ఒత్తిడి నుంచి దూరం చేస్తాయని నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి చెందిన అమర్‌నాథ్, లక్ష్మీ తెలిపారు. వారు 2015లో రూ.14 వేలు ఖర్చు చేసి ల్యాబ్రడార్ జాతికి చెందిన రెండు కుక్కలు తెచ్చుకున్నారు. వాటికి సిస్కో, చిచ్చు అని పేరు పెట్టి పెంచుకుంటున్నారు. వాటితో పాటు నేపాల్ బ్రీడ్ కుక్కను కూడా పెంచు కుంటున్నారు. అవి ఎక్కడికి వెళ్లినా మా వెంటే ఉంటాయి. వాటి పోషణకు ప్రతీ నెల రూ.15 నుంచి రూ. 20 వేల వరకు ఖర్చు అవుతోంది.



- అమర్‌నాథ్, కల్వకుర్తి

చిన్నా, పెద్ద తేడాలేని వ్యవస్థ కావాలి

» మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య
» రాజకీయాల్లో ఉంటూ ప్రజాసేవ చేసిన వ్యక్తి గుమ్మడి
» ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి



గుమ్మడి నరసయ్యకు పురస్కారం అందజేస్తున్న జేపీఎన్‌సీఈ కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో చిన్నా, పెద్ద అనే పెద్దలనే తేడాలేని వ్యవస్థ కావాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం సమీపంలోని జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో జయప్రకాష్ నారాయణ పురస్కారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇల్లెందు మాజీ ఎమ్మెల్యేగా ఐదు సార్లు ఎన్నికై, సాదాసీదా జీవితం గడుపుతున్న గుమ్మడి నరసయ్యకు జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవికుమార్ రూ.లక్ష నగదుతో పాటు పురస్కారం, మెమెంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు ప్రముఖ సినీ రచయిత నటుడు తనికెళ్ల భరణి, గుమ్మడి నరసయ్య, కళాశాల చైర్మన్ రవికుమార్ లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్, జైపాల్‌రెడ్డి విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ఆదర్శవంతులుగా ఉండాలన్నారు. ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ రాజకీయాల్లో ఉంటూ ప్రజాసేవ వ్యక్తి గుమ్మడి నరసయ్య అన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నాయకుడు కిల్లె గోపాల్, ప్రముఖ న్యాయవాది మనోహర్‌రెడ్డి, హన్మేష్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వెంకటేష్, కళాశాల కార్యదర్శి వెంకటరామారావు, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఈవీ చంద్రశేఖర్, పరీక్ష విభాగం అధికారి సందీప్‌కుమార్, వజ్రలింగం పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల భూములు రక్షించాలి

» ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా


స్వామి వివేకానంద చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మక్తల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాల భూములు రక్షించి, కళాశాల తరలింపు ఆలోచన మానుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పరిషత్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా మక్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి స్వామి వివేకానంద చౌరస్తా వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేష్‌తేజ, పట్టణ అధ్యక్షుడు అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోందన్నారు. కలెక్టర్, మంత్రికి విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. మినీ స్టేడియం కోసం భవనాలు కూల్చడం వల్ల సుమారు రూ.15కోట్ల ప్రజా ధనం వృథా అవుతోందన్నారు. కళాశాలను అక్కడే ఉంచి వేరే ప్రదేశంలో స్టేడియం నిర్మించాలన్నారు. కళాశాలకు కొత్త భవనం నిర్మించాలన్నారు. ఇంటర్ బోర్డు పరిధిలో ఉన్న కళాశాలను కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కబ్జాకు గురికాకుండా కంచె వేయాలన్నారు. కళాశాల భవనం తరలిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు వినయ్, నరేష్, ఇందు, విజయలక్ష్మీ, అభి, ఆనంద్, శివ, రంజిత్, సాయి, నవీన్, నాని, మీనాక్షి, అక్షర, నవిత, వసుంధర, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పని నిరీక్షణ

» పీఏసీఎస్‌ల వద్ద బారులు తీరుతున్న రైతులు
» ఆత్మకూరు, కొత్తకోటలలో బీఆర్ఎస్ ధర్నా


కొత్తకోట చౌరస్తాలో యూరియా కోసం ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఆత్మకూరు/ కొత్తకోట/ గట్టు/ భూత్పూర్/ గోపాల్‌పేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పొలం పనుల్లో నిమగ్నం కావాల్సిన రైతులు యూరియా కోసం కష్టాలు పడుతున్నారు. ప్రాథమిక సహకార కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. తమ వంతు కోసం నిరీక్షిస్తున్నారు. ఈ విషయంపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలోని ఆత్మకూరు, కొత్తకోట మండల కేంద్రాల్లో సోమవారం రైతులు ధర్నా చేశారు.

● ఆత్మకూరులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులకు పదుల సంఖ్యలో యూరియా బస్తాలు ఇస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సింగిల్ విండో అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, వ్యవసాయ అధికారి వినయ్ కుమార్‌లను ప్రశ్నించారు. రైతులందరికీ సమానంగా యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు జానకిరామ్, చెన్నయ్య, రామకృష్ణ, గడ్డమీద శ్రీనివాసులు, అంజనేయులు, మాసన్న, భరత్‌రెడ్డి, భీమన్న, రాజారెడ్డి పాల్గొన్నారు.

● కొత్తకోట పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి ధర్నా చేశారు. కార్యాలయ ఇన్‌చార్జి శివాచారికి వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో వామన్‌గౌడ్, విశ్వేశ్వర్, చెన్నకేశవరెడ్డి, బాబురెడ్డి, కొండారెడ్డి, శ్రీనువాసులు, గోవిందు, ప్రశాంత్, మల్లేష్, రవీందర్‌రెడ్డి, రాములు యాదవ్, ఖాజామైనోద్దీన్, శ్రీనివాస్‌జీ, లక్ష్మణ్ నాయక్, గోపాల్ నాయక్, రాజు, వినోద్ సాగర్, కృష్ణయ్యగౌడ్ పాల్గొన్నారు.

ముందు రోజే క్యూ

జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు ప్రాథమిక సహకార సంఘం కార్యాలయానికి మంగళవారం 450 బస్తాల యూరియా రానున్నది. విషయం తెలుసుకున్న రైతులు సోమవారం ఉదయమే కేంద్రం వద్దకు చేరుకున్నారు. తమ పాసు బుక్కులను, ఆధార్‌కార్డులను ప్లాస్టిక్ కవర్లలో పెట్టి క్యూ లైనులో ఉంచారు.

ఉదయం 6 గంటల నుంచే..

మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ డీలర్ దుకాణం ముందు రైతులు ఉదయం 6 గంటల నుంచే అధిక సంఖ్యలో బారులు తీరారు. 10 గంటల సమయంలో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారుల సమక్షంలో యూరియా బస్తాల పంపిణీ ప్రారంభించారు. మండలానికి దాదాపు 14 వందల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటివరకు 750 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు ఏవో మురళీధర్ తెలిపారు. రెండు, మూడు రోజుల్లో 200 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని చెప్పారు.

● వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార కేంద్రం వద్ద రైతులు ఉదయం 6 గంటల నుంచే బారులు తీరారు. తమ వంతు కోసం గంటల తరబడి ఎదురు చూశారు. ఒక దశలో తోపులాట జరగడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. రైతులను శాంతింప చేసి క్రమ పద్ధతిలో యూరియా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నారు. మంగళ, బుధ వారాల్లో మళ్లీ యూరియా వస్తుందని ఏవో కరుణశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట మండల నాయకులు మణ్యం. చంద్రశేఖర్, మతీన్, గోపాల్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

సీవోఈ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మైనార్టీ గురుకులాల కళాశాలల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా మైనార్టీ గురుకులాల రీజినల్ లెవెల్ కో ఆర్డినేటర్ ఖాజా బహోద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా లోని మైనార్టీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కళాశాలలో ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని, 29న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల మూసివేత


ఫస్ట్‌ఎడ్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

మహమ్మదాబాద్ ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఫస్ట్‌ఎయిడ్ సెంటర్లను సోమవారం జిల్లా మాస్ మీడియా అధికారిని మంజుల సీజ్ చేశారు. మండల కేంద్రంలోని సత్యనాయణరెడ్డి, రహీం, శ్రీనివాసులు, బాల్‌రెడ్డికి సంబంధించిన ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను సీజ్ చేశారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా తగ్గిన వరద

» 3.58 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గద్వాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో భారీగా తగ్గిపోయింది. కర్ణాటకలో వర్షాలు తగ్గిపోవడంతో కృష్ణాకు వరద తగ్గింది. సోమవారం ప్రాజెక్టులోకి 3.58 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు అధికారులు 7 గేట్లను 10 ఫీట్ల ఎత్తు ఎత్తి 1,87,208 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 62,162 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 198.36 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

ఆల్మట్టి ప్రాజెక్టుకు 1.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 1.50 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 1.55 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 1.51 లక్షల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. భీమా నదిపై ఉన్న సన్నతి బ్యారేజీ నుంచి 1.85 లక్షల క్యూసెక్కులను జూరాలకు విడుదల చేశారు. ప్రస్తుతం జూరాలకు 2.95 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 26 గేట్లను ఎత్తి 2,69,917 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి సుంకేసులకు 12 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో 9 వేల క్యూసెక్కులను శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు.

రోడ్డు వేయండి సారూ..

- గతంలో ఎమ్మెల్యేను కోరిన గ్రామస్థులు
- మూడు గ్రామాల రైతులకు ఇబ్బంది

రేవల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి తలుపునూరు గ్రామ శివారుల దారి వెంట నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తిలోని చెరువు కట్ట మూల వరకు నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తి, పెద్దాపురం, రేవల్లి, మండలంలోని తలుపునూరు గ్రామాలను కలిపే శివారు దారి ఉంది. ఈ దారి ప్రధాన రోడ్డు మార్గం కానప్పటికీ తూడుకుర్తి గ్రామంలోని పెద్ద చెరువు అలుగు పారినప్పటికీ ఈ దారి వెంట ప్రయాణించే వెసలుబాటు వాహనదారులకు, రైతులకు ఉండేది. అదే విధంగా ఈ గ్రామాల రైతులకు ధాన్యాన్ని తరలించడానికి పొలం దగ్గరికి వెళ్లడానికి శివారు దారి ప్రధానం. పది రోజుల నుంచి కురిసిన వర్షాలకు దారి వెంట నీరు వాగులా ప్రవహించి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాకు దారి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా... వారు సంబంధిత అధికారులకు చెప్పి రైతుల సమస్యలు తీర్చాలని సూచించారు.

మూడు గ్రామాల రైతులకు ఇబ్బందులు..

ప్రధానంగా తూడుకుర్తి, పెద్దాపురం, తలుపునూరు గ్రామాల రైతులకు పొలాల దగ్గరికి వెళ్లడానికి మరొక మార్గం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తలుపునూరు, పెద్దాపురం గ్రామ రైతులు ద్విచక్ర వాహనం కూడా వెళ్లే వెసలుబాటు లేకపోవడంతో తూడుకుర్తి గ్రామానికి వెళ్లి అటు వైపు నుంచి పొలాల దగ్గరికి తిరిగి వెళ్తున్నారు. దాదాపు ఆరు కిలోమీటర్ల మేర తిరిగి పొలాల దగ్గరికి వెళ్లాల్సి వస్తుందని, పంట చేతికి వచ్చే సమయంలో ఇంకా మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని, ప్రజాప్రతినిధులు, అధికారులు మా సమస్యను గుర్తించి త్వరగా దారి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మా పొలాలకు ఇదే దారి...



తలుపునూరు గ్రామానికి తూర్పు భాగానికి పొలాలు ఉన్న చాలా మంది రైతులకు పొలాల దగ్గరికి వెళ్లడానికి శివారు దారే దిక్కు. దారి కొట్టుకు పోవడంతో తూడుకుర్తి గ్రామం వెంట తిరిగి రావాల్సి వస్తుంది.

- చిన్న కురుమతిరెడ్డి, రైతు మాజీ ఎంపీటీసీ తలుపునూరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

ఈ శివారు దారి వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల సరిహద్దులో ఉన్నది. ఈ రోడ్డు ఏ జిల్లాకు కేటాయించారో చూసి నిధులు కేటాయించి రోడ్డు ఏర్పాటు చేయాలి. ఇప్పుడే మా దృష్టికి వచ్చింది.



వర్షాలకు కోసుకుపోయిన దారి



ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టి త్వరలోనే రైతుల సమస్యలు పరిష్కరిస్తాం.

- విశ్వ, పంచాయతీరాజ్ శాఖ ఏఈ

న్యూస్ బాక్స్

సతీష్ యాదవ్‌కు గిడుగు రామ్మూర్తి అవార్డు ప్రదానం

వనపర్తి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్‌కు గిడుగు రామ్మూర్తి అవార్డును ప్రదానం చేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సతీష్ యాదవ్‌కు గిడుగు రామ్మూర్తి అవార్డును నిర్వాహకులు ప్రదానం చేసినట్లు చెప్పారు.

డంపింగ్ యార్డు కబ్జా చేశాడని నోటీసు అందజేత

గోపాల్‌పేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రభుత్వానికి సంబంధించిన భూమిని పూడ్చిన వ్యక్తికి నోటీసులు అందజేశారు. మండలంలోని బుద్ధారం గ్రామ పరిధిలోని లక్ష్మీతండాలో సర్వే నంబర్ 590లో ప్రభుత్వం గతంలో డంపింగ్ యార్డుకు ఆ భూమిని కేటాయించారు. గ్రామపంచాయతీకి కేటాయించిన స్థలాన్ని ఆగస్టు 24న సెలవు దినం కావడంతో గ్రామానికి చెందిన పీట్యానాయక్ మట్టి కొట్టించి చదును చేశాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీడీవో భవాని సోమవారం అతడికి నోటీసులు జారీ చేశారు.

పోడు భూములకు పట్టా ఇవ్వాలి

పాన్‌గల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు తరతరాల నుంచి సాగు చేస్తున్న పోడు భూములకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్య నాయక్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామ పోడు భూముల రైతులు సోమవారం హైదరాబాదులోని ఎస్సీ ఎస్టీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు. రవి నాయక్, బాలు, హనుమంతులు, బాబు నాయక్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వీపనగండ్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం అందించారు. రాజు, రాములు, లోక నాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలకు పాల్పడిన ముగ్గురు నేరస్తులు అరెస్టు

వనపర్తి రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ధని ఫైనాన్షియల్ లోన్ యాప్ పేరుతో సైబర్ మోసాలకు పాల్పడిన నేరస్తులను అరెస్టు చేసినట్లు సీఐ కృష్ణ తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలనగర్‌కు చెందిన రాజు ధని ఫైనాన్షియల్ లోన్ యాప్‌లో మోసపోయానని వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో గతంలో వనపర్తి పట్టణంలోని గాంధీ నగర్ ప్రాంతంలో దాడి చేసి మొత్తం 11 మంది నిందితులను అరెస్టు చేసి వారిని జైలుకు పంపించారు. తదుపరి దర్యాప్తులో భాగంగా ఆదివారం వనపర్తి సీఐ నమ్మదగిన సమాచారం ఆధారంగా పాత్లావత్ సంతోష్, వడిత్యవత్ శాంతమ్మ, వడిత్యవత్ అనూష అరెస్టు చేసినట్లు చెప్పారు.

ట్యాంక్ బండ్ రోడ్డుకు గేట్ల ఏర్పాటు ఆపాలి

వనపర్తి రాజీవ్ చౌరస్తా, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వల్ల చెరువు ట్యాంక్ బండ్‌పై భారీ వాహనాలు వెళ్లకుండా గేట్లు ఏర్పాటు చేయడం ఆపాలని బీఆర్ఎస్ నాయకులు గట్టు యాప్, వాకిటి శ్రీధర్, తదితరులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కోరారు.

సెల్ ఫోన్ రికవరీ

ఖిల్లాఘణపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాంపల్లికి చెందిన సిద్దేవేణు పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను పోలీసులు రికవరీ చేసి సోమవారం ఏఎస్ఐ సత్యం గౌడ్ బాధితుడికి అప్పగించారు.

కలెక్టర్‌ను కలిసిన నేత కార్మికులు

అమరచింత, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : చేనేత రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని కోరుతూ సోమవారం అమరచింత చేనేత కార్మికులు కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి వినతి పత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అమరచింత చేనేత కార్మిక సంఘం నాయకులు పారుపల్లి శీను, తెలుగు రమేష్, రవి, అంజి, కిరణ్‌కుమార్ నరసింహ, రాము, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ విద్యను పటిష్ట పరుస్తాం..

ఆత్మకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యను పటిష్టపరిచేందుకు ఎంపీ నిధుల నుంచి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంతంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలకు రూ.35 లక్షల నిధులను మంజూరు చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో స్థలం పరిశీలించినట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనురాధ, బీజేపీ నాయకులు అశోక్, విష్ణువర్ధన్‌రెడ్డి, విజయ్ కుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హజ్రత్ సయ్యద్ బద్రోద్దీన్ సాహెబ్ ఉర్సు

ఖిల్లాఘణపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుమలాయపల్లి గ్రామ శివారులోని హజ్రత్ సయ్యద్ బద్రోద్దీన్ సాహెబ్ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉర్సు ఘనంగా నిర్వహించారు. కుల మతాల కతీతంగా భక్తులు దర్గా చుట్టూ ప్రదక్షిణలు చేసి కొబ్బరికాయల నైవేద్యాలు సమర్పించారు. దర్గాపై దట్టీలు, పూలు ఉంచి ఊదు, సాంబ్రాణీ పొగలు వేసి దర్గా కమిటీ సభ్యులు బద్రోద్దీన్ కుటుంబ సభ్యులు, ముస్లిం మత పెద్దలు ప్రార్థనలు చేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో కలిసిమెలిసి ఉండాలని, పాడి పంటలతో ఆర్థిక అభివృద్ధి సాధించాలని ప్రార్థనలు చేసినట్లు ముస్లిం మత పెద్దలు తెలిపారు. దర్గా కమిటీ సభ్యులు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

స్థానిక ఎన్నికలకు బీజేపీ నాయకులు సిద్ధం

- రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబిరెడ్డి వెంకటరెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబిరెడ్డి వెంకట్‌రెడ్డి

వనపర్తి రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వచ్చే స్థానిక ఎన్నికలకు బీజేపీ గెలుపునకు పార్టీ నాయకులు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి మండల పరిధిలోని చందాపూర్‌లో రాబోయే స్థానిక ఎన్నికల దృష్ట్యా బీజేపీ నాయకులను ఎన్నికలకు సన్నద్ధం చేయడంలో భాగంగా గ్రామ నాయకులతో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల గడువు ముగిసి రెండేళ్లు కావొస్తున్నా కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి స్థానిక ఎన్నికలకు వెళ్లే దమ్ము, ధైర్యం లేదని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి ఎన్నికలకు వెళ్లాల్సిందేనని కమిటీల పేరుతో కాలయాపన చేసి మోసం చేస్తే బీసీ సమాజం కాంగ్రెస్ పార్టీని బొంద పెడుతుందని హెచ్చరించారు. పెద్దిరాజు, నంద వెంకటేష్, బాలరాజు, చిన్న నరసింహ, సంపత్, రాఘవేందర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలంటూ బీజేపీ నాయకుల పాదయాత్ర

పెద్దమందడి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిని నిర్మాణం చేపట్టాలని బీజేపీ ఆధ్వర్యంలో ముప్పురి చెన్నయ్య ఆధ్వర్యంలో బీజేపీ మండల కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన పాదయాత్ర చేపట్టారు. వనపర్తి నుంచి పెద్దమందడి మండల కేంద్రానికి ప్రధాన రహదారి బీటీ రోడ్డు లేని కారణంగా చాలా మంది ప్రజలు అవస్థలు పడుతున్నారని, తక్షణమే ప్రధాన రహదారిని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పురుషో త్తంరెడ్డి, శ్రీశైలం, రాము, శివారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పెద్దిరాజు పాల్గొన్నారు.

సురవరంను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లో ఉన్నా..

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి



సురవరం జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ చేస్తున్న నాయకులు

వనపర్తి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సురవరం ప్రతాపరెడ్డిని ఆదర్శంగా తీసుకుని రాజకీయ జీవితంలో ఎలాంటి అవినీతికి తావు లేకుండా స్వచ్ఛమైన రాజకీయాలు చేస్తున్నానని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య కల్యాణ మండపంలో సురవరం ప్రతాపరెడ్డి జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్రిక సంపాదకుడిగా, పరిశోధకుడిగా, పండితుడిగా, క్రియాశీల ఉద్యమకారుడిగా సురవరం ప్రతాపరెడ్డి ప్రతిభ అనన్యమైనదన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించిన తన అన్న మాధవరెడ్డికి సురవరం ప్రతాపరెడ్డి జీవిత పుస్తకాన్ని అంకితం చేస్తున్నామని తెలిపారు. అంతకు ముందు సురవరం ప్రతాపరెడ్డి, జిల్లెల మాధవరెడ్డి చిత్రపటాలకు పూలమాలలతో ఘనంగా నివాళి అర్పించారు. పుస్తక రచయిత ఆచార్య గంటా జలంధర్‌రెడ్డి చిన్నారెడ్డిని, మాధవరెడ్డి కుమార్తె డాక్టర్ జిల్లెల శిల్పను శాలువాతో ఘనంగా సన్మానించి, షీల్డ్‌తో సత్కరించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, రాజేంద్రప్రసాద్, చీర్ల జనార్దన్, ఎండీ బాబా, పలుస శంకర్‌గౌడ్, డాక్టర్ పాండురంగారెడ్డి, పోరెడ్డి రంగయ్య, సురవరం కృష్ణవర్ధన్‌రెడ్డి, ఆచార్య సూరారవు భిక్షం తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలి



కొత్తకోటలో నివాళి అర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం బీపీ మండల్ కమిషన్ సిఫారసులను అన్ని అమలు చేయాలని అర్జున్ యాదవ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బీసీ మండల్ జయంతిని నిర్వహించి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల ప్ర దాత, మండల్ నివేదిక రూపశిల్పి బీపీ మం డల్ అని అన్నారు. రాములు యాదవ్, సత్యనా రాయణ, నాగరాజు, రామకృష్ణ, పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు..

కొత్తకోట : జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలైతేనే భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యానికి అర్థం ఉంటుందని బీసీ కులాల ఐక్య వేదిక దేవరకద్ర నియోజకవర్గ అధ్యక్షుడు రాములు యాదవ్ అన్నారు. సోమవారం పట్టణ చౌరస్తాలో బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బీపీ మండల్ (బిందేశ్వర్ ప్రసాద్ మండల్) 107వ జయంతి నిర్వహించారు. మండల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చంద్రశేఖర్, శ్రీనివాసాచారి, భాస్కర్, మహేష్, కృష్ణయ్యగౌడ్, కురుమూర్తి యాదవ్, లక్ష్మయ్య, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేయకుండా మాజీ ఎమ్మెల్యేను విమర్శించడం సరికాదు

ఆత్మకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మక్తల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిని విమర్శించడం కాంగ్రెస్ నాయకులకు ఎంత వరకు సమంజసమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ ఆరోపించారు. సకాలంలో రైతులకు ఎరువులు అందించాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో తెలియజేయడం తప్పు అన్నట్లుగా కాంగ్రెస్ నాయకులు ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి మాజీ ఎమ్మెల్యేపై తీవ్ర పదజాలంతో ఆరోపించడం సమంజసం కాదని మండిపడ్డారు. బంగారు శ్రీనివాసులు, జానకిరామ్, చెన్నయ్య, రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోధన అభ్యసన సామగ్రితో విద్యాబోధన చేయాలి

ఖిల్లాగణపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక, ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలో బోధన అభ్యసన సామగ్రి (టీఎల్ఎం)తో ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని మండల విద్యాధికార జయశంకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మండల స్థాయి బోధనాభ్యసన సామగ్రి మేళను ఎంపీడీవో సునిత ప్రారంభించారు. ముగింపు సమావేశంలో తహసీల్దార్ సుగుణ బహుమతులను అందజేశారు.

పెద్దమందడి : విద్యార్థులకు అర్థవంతంగా బోధన చేయాలంటే బోధన అభ్యసన సామగ్రిని విరివిగా ఉపయోగించాలని మండల విద్యాధికారి మంజులత సూచించారు. సోమవారం మండల పరిధిలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు కలిసి మండల కేంద్రంలో నిర్వహించిన మేళాను ఆమె సందర్శించారు.

గణిత విజ్ఞాన మేళా..

వనపర్తి విద్యా విభాగం : వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాల కేంద్రంగా ఈ నెల 24, 25తేదీల్లో గణిత విజ్ఞాన సంస్కృతిక మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గట్టుమీది భానుప్రసాద్, జిల్లా కోశాధికారి అరవింద్ ప్రకాష్, వనపర్తి పాఠశాల కార్యదర్శి, కె.కృష్ణమోహన్, విభాగ్ ప్రముఖ్ కవిత, మాతృమండలి కార్యదర్శి కరుణ, తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో వైద్య పరీక్షలు

వీపనగండ్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. 108 మంది బాలికలకు డాక్టర్ రాజశేఖర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. డాక్టర్ శ్వేత, కేశవులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభకు తరలిన నాయకులు

అమరచింత, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి రెండు రోజులపాటు మహబూబ్‌నగర్‌లో కొనసాగిన అఖిలభారత ఐక్య రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభలకు సోమవారం అమరచింత మండలంలోని ఆయా గ్రామాల నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షుడు రాజన్న మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. రాజన్న, సి.రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

'మన పాఠశాల మన ఆత్మ గౌరవం' కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

వనపర్తి విద్యా విభాగం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : తపస్ వనపర్తి జిల్లా కార్యాలయంలో మన పాఠశాల మన ఆత్మగౌరవం కరపత్రాన్ని సోమవారం తపస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శులు హనుమంతరావు, నవాజ్ సురేష్, జిల్లా అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వరప్రసాద్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు మాట్లాడుతూ మన పాఠశాలను పరిశుభ్రంగా, ఆకుపచ్చగా మరియు స్ఫూర్తిదాయకంగా ఉంచుతూ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని కోరారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు

వనపర్తి విద్యా విభాగం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగం చాలా దారుణ స్థితికి చేరిందని, పేద పిల్లలకు వరంగా ఉండే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వం సమయానికి విడుదల చేయకపోవడంతో వేలాది మంది విద్యార్థుల చదువులు మధ్యలోనే నిలిచిపోయే పరిస్థితులు వస్తున్నాయని ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ అర్జున్ సాతర్ల ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ కాలేజీలు రీయింబర్స్‌మెంట్, డబ్బులు రాకపోవడంతో విద్యార్థుల వద్ద బలవంతంగా వసూలు చేస్తున్నాయన్నారు.

రైతులకు బోనస్ డబ్బులు చెల్లించాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మదనాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్ వరి ధాన్యం బోనస్ డబ్బులు చెల్లించాలని సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ధాన్యం అమ్మి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికి ప్రభుత్వం బోనస్ ఇవ్వలేదని అన్నారు. వెంటనే రైతులకు బోనస్ డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రస్తుతం రైతులు యూరియా కోసం అష్ట కష్టాలు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి దళారులు చేస్తున్న బ్లాక్ మార్కెట్ దందాను అరికట్టి రైతులకు కావాల్సిన యూరియాను తక్షణమే అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, కృష్ణయాదవ్, కృష్ణ, కురుమన్న, వడ్డె రాజు, కురువ శ్రీను, ఆనంద్, భాస్కర్, బంగారు రవి, డి.రాములు, చంద్రయ్యగౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి రాజీవ్ చౌరస్తా, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు సూచించారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కీమ్యానాయక్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. 45 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- డీఎస్పీ వెంకటేశ్వరరావు

వనపర్తి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులపై సంబంధిత మండలాల ఎస్ఐలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వరరావు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ... ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. చిన్న సమస్యలను కింది స్థాయిలోనే పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని సూచించారు. 10 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి



రోడ్డు వేయాలని కోరుతున్న యువకులు

రేవల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఏదుల మండలంలోని అనంతపురం గ్రామం నుంచి తీగలపల్లి వెళ్లే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డీవైఎఫ్ జిల్లా కార్యదర్శి గడ్డికొపుల మహేష్ డిమాండ్ చేశారు. అనంతపురం నుంచి తీగలపల్లి రోడ్ చాలా గుంతలు ఉన్నాయని, చాలా సంవత్సరాల నుంచి ఈ రోడ్డు దుస్థితి ఇలాగే ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్నా గత ప్రభుత్వం అవలంబించిన విధానాన్ని ఈ ప్రభుత్వం అవలంబిస్తుందన్నారు. తక్షణమే ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివ, లోకేష్, నిరంజన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజించాలి



మట్టి ప్రతిమలను అందజేస్తున్న ప్రసన్నలక్ష్మి

కొత్తకోట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణానికి ప్రమాదం లేని వినాయక చవితి పండుగను చేసుకుందామని ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రసన్నలక్ష్మి అన్నారు. సోమవారం కొత్తకోటలోని కన్యకాపరమేశ్వరి వాసవీమాత ఆలయంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వినాయక చవితి వేడుకలను ప్రతీ ఒక్కరు భక్తిశ్రద్ధలతో ఆనందంగా నిర్వహించుకోవాలన్నారు. పర్యావరణ రహిత మట్టి వినాయకులను పూజించాలని సొంత ఖర్చులతో తయారు చేయించిన ప్రతిమలను అందజేశారు. ప్రభాకర్, చంద్రకాంత్, శ్రీనివాసులు, మంజుల, జయలక్ష్మీ, రాధిక, స్వర్ణలత, శాంత, లక్ష్మి, జలజ పాల్గొన్నారు.

పెండింగ్‌లోని కమీషన్ ఇవ్వాలి



వనపర్తిలో వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

కొత్తకోట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్లు తమకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఐదు నెలల కమీషన్ వెంటనే చెల్లించాలంటూ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, డీలర్లు నాగేశన్న, శ్రీనివాసులు, ఆర్కేగౌడ్, గమనియాల్, ఖాన్, రాజు, వెంకటయ్య, హరిగౌడ్ ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి..

అమరచింత : రేషన్ డీలర్ల మండల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. రాములు, ఆదాం, వెంకటేష్, కృష్ణయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

పాన్‌గల్ : పెండింగ్‌లోని ఐదు నెలల కమీషన్ డబ్బులను తక్షణమే మంజూరు చేయాలని రేషన్ డీలర్ల సంఘం సభ్యులు కోరారు. సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వెంకటేష్, పిచ్చన్న, వెంకటయ్య , రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్ : రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రాము డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ చక్రపాణికి రేషన్ డీలర్లు వినతిపత్రం అందజేశారు. వనపర్తి మండల రూరల్ అధ్యక్షుడు నరేష్, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్, రాఘవేంద్ర, నరసింహారెడ్డి, సత్యరెడ్డి, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మోసపూరిత మాటలు నమ్మొద్దు

కొత్తకోట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : యూరియాపై బీఆర్ఎస్ నాయకుల మోసపూరిత మాటలు నమ్మొద్దని రైతులకు మార్కెట్ చైర్మన్ ప్రశాంత్ విజ్ఞప్తి చేశారు. సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. యూరియాపై రైతులు ఇబ్బంది పడుతుంటే బీజేపీ నాయకత్వం మౌనంగా ఉండడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసన్ని తట్టుకోలేకనే బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం కారణంగానే కేంద్రం యూరియా కొరత సృష్టిస్తుందని ఆరోపించారు. యూరియా విషయంలో ప్రభుత్వాన్ని అబాసుపాలు చేయాలని ఆ పార్టీలు కుట్ర పన్నాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు రైతులకు వాస్తవాలు చెప్పకుండా ధర్నా చేయడం సిగ్గు చేటన్నారు. ప్రజా ప్రభుత్వంపై అనవసరంగా అబండాలు వేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనని హెచ్చరించారు. పార్టీ నాయకులు డాక్టర్ బాబు, కృష్ణారెడ్డి, బోయోజ్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బీచుపల్లి యాదవ్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, నరేందర్‌రెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

స్ఫూర్తివంతం సురవరం జీవితం



నివాళి అర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

వనపర్తి రాజీవ్ చౌరస్తా, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : స్ఫూర్తివంతమైన జీవితాన్ని గడిపిన మహనీయుడు సురవరం ప్రతాపరెడ్డి అని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. సురవరం 73వ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని సురవరం ప్రతాపరెడ్డి విగ్రహానికి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు.

వనపర్తి టౌన్ : స్వేచ్ఛ, చైతన్య రహితంగా ఉన్న సమాజాన్ని మేల్కొల్పిన గొప్ప సంఘ సంస్కర్త సురవరం ప్రతాపరెడ్డి అని వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని సురవరం ప్రతాపరెడ్డి విగ్రహానికి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనలో తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న అణచివేతలను ఎదిరించిన సాహసి సురవరం ప్రతాపరెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గంధం రాజశేఖర్, శివ నాయక్, అంబటి రమేష్, నందిఎట తిరుపతయ్య, శ్రీనివాసచారి, ఆరీష్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్ : వనపర్తి మండల పరిధిలోని చిట్యాల ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సురవరం ప్రతాపరెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడారు. బూరోజు గిరిజాచారి, ఉపాధ్యాయులు సంజీవయ్య, రవి , వరదాచారి, మహమ్మద్ షఫీ, శ్రీనివాసులు, జ్యోతిలక్ష్మి, స్వరూప, గోపాల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చిట్యాలలో సురవరం ప్రతాపరెడ్డి వర్ధంతిలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు